ప్రజాశక్తి
మంగళవారం 2 జులై 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న వీధి వ్యాపారులు

ప్రత్యామ్నాయం చూపాల్సిందే..

- బంకుల తొలగింపును అడ్డుకున్న చిరు వ్యాపారులు
- సిఐటియు ఆధ్వర్యంలో నిరసన
- కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన జిల్లా కమిటీ నేతలు



పోలీసులతో మాట్లాడుతున్న కేశవరావు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్లోని చెప్పుల బజార్లో ఫుట్‌పాత్‌పైన ఉండే బంకులను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టగా బంకుల యజమానులు సిఐటియు నాయకులు పీసీ కేశవరావు ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. రాస్తా రోకో నిర్వహించడంతో పాటు కనిగిరి ఆర్డీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. మున్సిపల్ సిబ్బంది, పోలీసులు బంకులు తొలగింపునకు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పిసి కేశవరావు మాట్లాడుతూ వీధి వ్యాపారుల చట్టం ప్రకారం నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా బంకుల తొలగింపునకు మున్సిపల్ కమిషనర్ చర్యలు చేపట్టడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. చిరు వ్యాపారులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. కనిగిరిలో బంకుల తొలగింపు విషయంపై ▶ 2లో



దర్శి, రాజంపల్లిలో పింఛన్ అందజేస్తున్న మంత్రి స్వామి



రేపల్లె, పేటేరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని

పండగలా పింఛన్ల పంపిణీ

- ఒకేసారి రూ.7 వేలు అందడంతో లబ్ధిదారుల్లో ఆనందం
- ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన మంత్రులు స్వామి, గొట్టిపాటి, అనగాని
- ప్రకాశం జిల్లాలో తొలి రోజు 94.57 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల జిల్లా

కూటమి తరుపున ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛను రూ.4 వేలకు పెంపు అమలు కార్యక్రమం సోమవారం నాడు లాంఛనంగా ప్రారంభమైంది. మూడు నెలల అరియర్స్‌తో కలిపి మొత్తం రూ.7 వేలను



కొండమంజూరులో వికలాంగునికి పెన్షన్ అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పాలకపక్ష నేతలు పండుగలా నిర్వహించారు. ప్రకాశం జిల్లాలో తొలిరోజే 94.57 శాతం పింఛన్లు పంపిణీ చేయడం గమనార్హం. రాష్ట్ర మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్ ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. దర్శి నియోజకవర్గంలో మంత్రి స్వామితో పాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా, దర్శి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి పింఛన్లు పంపిణీ చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ జె,.పంగులూరు, కొరిశపాడు మండలాల్లో పలు గ్రామాల్లో లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ రేపల్లె, నిజాంపట్నం మండలాల్లో ఇంటింటికీ వెళ్లి ▶ 2లో

కన్నీటి వీడ్కోలు

- స్వగ్రామానికి చేరుకున్న జవాన్ సుభాన్‌ఖాన్ మృతదేహం
- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు
- నివాళులర్పించిన మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-రేపల్లె

జమ్మూకాశ్మీర్‌లోని లద్దాక్ వద్ద యుద్ధ ట్యాంకులో వెళుతూ నదిని దాటే ప్రయత్నంలో మృతిచెందిన ఐదుగురిలో బాపట్ల జిల్లా, రేపల్లె మండలం, కైతేపల్లి పంచాయతీ ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన జవాన్ సుభాన్ ఖాన్(40) కూడా ఉన్నారు. సుభాన్‌ఖాన్ మతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో సోమవారం స్వగృహానికి తీసుకొచ్చారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

మూడు తరాల వాళ్లు ఆర్మీలోనే..

జవాన్ సుభాన్‌ఖాన్‌కి చెందిన మూడు తరాల వాళ్లు ఆర్మీలో పని చేశారు. ఈయన తండ్రి గౌస్ ఖాన్ కూడా ఆర్మీ జవాన్‌గా పనిచేసి.. రిటైర్డ్ అయ్యారు. అదే స్ఫూర్తితో సుభాన్‌ఖాన్ కూడా ఆర్మీలో చేరారు. ప్రస్తుతం హవల్దార్ స్థాయిలో మెకానికల్ విభాగంలో విధులు నిర్వహిస్తుండగా శనివారం తెల్లవారుజామున దౌలత్ బేగ్ ఓల్డి ప్రాంతంలో భారత సైనికులు జరిపిన విన్యాసాల్లో ప్రమాదం జరిగింది. ఈ నెల 7వ తేదీన స్వగ్రామం రావలసి ఉండగా యుద్ధ ట్యాంక్‌తో సహా నదిలో కొట్టుకుపోయిన ఘటనలో సుభాన్ ఖాన్ మరణించారు. సుభాన్‌ఖాన్‌కు భార్య షామిలాబేగం, ఇద్దరు కుమారులు, ▶ 2లో





జవాన్ సుభాన్‌ఖాన్ (ఫైల్), స్వగ్రామానికి వచ్చిన మృతదేహం

శోకసంద్రంలో కాల్వపల్లె

నేడు జవాన్ రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు

ప్రజాశక్తి-రాచర్ల

జమ్మూకాశ్మీర్‌లోని లద్దాక్ వద్ద యుద్ధ ట్యాంకులో వెళుతూ నదిని దాటే ప్రయత్నంలో మరణించిన ఐదుగురిలో రాచర్ల మండలం, కాల్వపల్లె గ్రామానికి చెందిన ముత్తుముల రామకృష్ణారెడ్డి(47) కూడా ఉన్నారు. ఈయన మరో ఏడు నెలల్లో రిటైర్డ్ కానుండగా ఈ ప్రమాదం జరిగింది. రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని సోమవారం రాత్రి కాల్వపల్లెలోని స్వగృహానికి ప్రత్యేక వాహనంలో తీసుకొని వచ్చారు. దీంతో రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని చూసి.. కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. రామకృష్ణారెడ్డి తండ్రి రామస్వామిరెడ్డి ఆర్మీ జవాన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. రామకృష్ణారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రిటైర్‌మెంట్ అనంతరం నివాసం ఉండేందుకు కాల్వపల్లెలో నివాసం కోసం నూతన గృహాన్ని కూడా నిర్మించుకున్నారు. గృహప్రవేశం కూడా జరగకుండానే రామకృష్ణారెడ్డి మృతి చెందడం పట్ల గ్రామస్తులు, ఆ కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతి చెందారు. 30 సంవత్సరాల కిందటే సైన్యంలో చేరారు. 2025 జనవరి నెలలో రిటైర్డు కానున్నారు. ఈయన మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామానికి పంపారు. మంగళవారం ఉదయం ఈయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.



వెలిగొండ పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్

'వెలిగొండ' నిర్మాణ పనులు వేగవంతం

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వెలిగొండ ప్రాజెక్ట్ ప్రయోజనం ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏ. తమీమ్‌అన్సారియా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ సంబంధిత పనుల స్థితి గతులు, వీటిని పూర్తి చేసేందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు, పునరావాస పున: నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు, వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటిఎస్), కోర్టు కేసులు, వంటి అంశాలపై సంబంధిత ఉన్నతాధికారులతో సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జెసి ఆర్.గోపాలకష్ణతో కలిసి ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవటంతో పెండింగ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ తెలిపారు. తక్కువ బడ్జెట్‌తో త్వరగా పూర్తయ్యే పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిర్వాసిత గ్రామాలలో పర్యటించి ప్రజల అభ్యంతరాలు, సమస్యలను తెలుసుకుని తనకు నివేదించాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. .సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ మురళీ మోహన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఝాన్సీ లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

పింఛన్లు పంపిణీ చేశారు. ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పలు వార్డుల్లో ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకూ తిరిగి లబ్దిదారులకు పింఛన్లు అందజేశారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్, వైపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, కొండపి యువ నేత దామచర్లసత్య తదితరులు నియోజకవర్గాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తదితరులు నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. బాపట్ల జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పార్టీ నేతలు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు రూ.4 వేల పింఛన్ అందించడం జరిగిందని, ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో కోరారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల జాబితాలను తీసుకొని ఇళ్ల వద్దకు వెళ్లి వృద్ధులు, వికలాంగులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

కన్నీటి వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

ఒక కుమార్తె ఉన్నారు.

సైనిక లాంఛనాలతో

ఆర్మీ జవాన్ సుభాన్‌ఖాన్‌కి ఆర్మీ అధికారులు, బంధువులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. సుభాన్ మతదేహానికి రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, గ్రామ సర్పంచ్ మండలి అంజయ్య, ఆర్డీవో హేలా షారోన్, ఎమ్మార్వో చొప్ప రవీంద్రబాబు సందర్శించి నివాళుర్పించారు. ముందుగా సుభాన్‌ఖాన్ మృతదేహానికి ఆర్మీ అధికారులు నివాళులర్పించారు. గౌరవ వందనం సమర్పించి.. సైనిక లాంఛనాలతో జాతీయ జెండాను జవాన్ సతీమణికి అందించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని ర్యాలీగా శ్మశానవాటికకు తీసుకెళ్లి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గాలిలో కాల్పులు జరిపారు. జవాన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రత్యామ్నాయం చూపాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి వినతిపత్రం అందజేశారు. కనిగిరి వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించరాదని కోరారు. వీధి వ్యాపారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ సానుకూలంగా స్పందించి కనిగిరి మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా జివి కొండారెడ్డి మాట్లాడుతూ పామూరు బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ పాయింట్ వరకు, కొత్తూరు వరకు, పట్టణంలో వివిధ ప్రాంతాల్లో వీధి వ్యాపారులుగా ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వ వీధి వ్యాపారుల చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉండగా కనిగిరి మున్సిపాలిటీలో ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ప్రత్యామ్నాయం చూపించేంత వరకు బలవంతంగా ఖాళీ చేయించవద్దని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా అవసరమైన సర్దుబాట్లు చేయాలని చెప్పారు. రెవెన్యూ, పోలీసు శాఖ సమన్వయంగా సమస్యను పరిష్కరించాలి తప్ప బలవంతంగా ఖాళీ చేయించి వీధి వ్యాపారుల ఉపాధిని దెబ్బతీసే చర్యలు చేపట్టరాదని విజ్ఞప్తి చేశారు. వీధి వ్యాపారులు తమ ఉపాధి కోసం చేపట్టిన ఉద్యమానికి సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌కె బషీరా, ప్రసన్న, ఏడుకొండలు, పిచ్చయ్య, చిరు వ్యాపారుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'ఎస్‌వికెపి'కి పూర్వ వైభవం తేవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ఎస్‌వికెపి కళాశాల)కు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె విజయ్ అన్నారు. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ ప్రాంత విద్యార్థులపై ఉందన్నారు. భవిష్యత్‌లో పేదలకు ఉన్నత చదువులు దూరం కాకూడదన్నారు. స్థానిక శ్రీరెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థులతో విజయ్ మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో ఫీజులు చెల్లించే స్థోమత లేక మధ్యలోనే చదువులు ఆపేస్తున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం (2024-25) నుంచి అయినా ఎస్‌వికెపి ఎయిడెడ్ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులలో విద్యార్థులను చేర్చుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లోకేష్, పట్టణ నాయకులు వందనం, పవన్, సన్నీ, సుదర్శన్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

4న విద్యాసంస్థల బంద్

జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల విజ్ఞప్తి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఈ నెల 4న దేశవ్యాప్తంగా జరుగుతున్న విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యూ జిల్లా నాయకులు విజయ్, రాజు కోరారు. సోమవారం స్థానిక రెడ్డి మహిళా కళాశాల, వేమన డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులను ఉద్దేశించి సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ లీక్‌ను నిరసిస్తూ 2024 జులై 4వ తేదీన దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఏఎస్ఎఫ్ఐ, పిడిఎస్ఓ కేంద్ర విద్యార్థి సంఘాల కమిటీలు పిలుపునిచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల పట్ల పాలకులు వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరిని ఖండిస్తూ ఈ నెల నాలుగో తేదీన జరగనున్న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థల బందును జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె విజయ్, పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు ఎం రాజు, ఎస్ఎఫ్ఐ మార్కాపురం పట్టణ నాయకులు వందనం, శేఖర్, దేవరాజ్, పిడిఎస్‌యు మార్కాపురం పట్టణ అధ్యక్షులు ఎం కోటి, కార్యదర్శి చిట్టిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పట్టణంలోని విత్తన కేంద్రాలు, ఎరువుల దుకాణాలలో సోమవారం జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎస్ రామ్‌మోహన్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గాయత్రి ట్రేడర్స్ దుకాణంలో ప్రభుత్వ నిబంధనల మేరకు, అమ్మకాలకు సంబంధించిన సరైన అనుమతి పత్రాలు పీసి (సోర్స్) లేనందున 3.16 లక్షల విలువైన విత్తనాల అమ్మకాలను, శ్రీహరి దుకాణంలోని 29,750 రూపాయల అమ్మకాలను నిలిపివేశారు. విత్తన, పురుగు మందుల కేంద్ర దుకాణాల యజమానులు ఎప్పటికప్పుడు వారి వద్ద ఉన్న ఎరువులు, విత్తనాల, వివరాలను రేట్లను చూపించే, స్టాక్ బోర్డ్ నిర్వహణ సక్రమంగా ఉండాలని తెలియజేశారు. ప్రభుత్వ అనుమతి కలిగిన నాణ్యమైన విత్తనాలను, ఎరువులను రైతులకు అమ్మాలని, అమ్మకపు వివరాలను రికార్డులో పొందుపరిచి, ఆ రైతులకు రసీదులు ఇవ్వాలని ఆయన తెలియజేశారు. అలా లేని యెడల వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మార్కాపురం ఏడీఏ డీ బాలాజీనాయక్, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, బీటీఎం సురేఖ పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీకి ఆహ్వానం లేదు: తాటిపర్తి

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యేగా తనకు ఆహ్వానం లేదని యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శింగరాయకొండలో సోమవారం వైసిపి నాయకులు చాంద్‌బాషా, ఎక్సైడ్ బ్యాటరీ షాపును ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెన్షన్లు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చినందుకు అభినందనలని అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే అయిన తనకు ఈ కార్యక్రమానికి కనీసం ఆహ్వానం కూడా అందలేదన్నారు. సర్పంచి, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పిటిసిలకు సైతం ఆహ్వానాలు లేవని, కేవలం అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ టౌన్ కన్వీనర్ షేక్ పటేల్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ స్టేట్ మైనారిటీ సెల్‌నాయకులు షేక్ లియాకత్, కరీం, జావిద్, షేక్.మస్తాన్, ఆర్ఎంపి సింగయ్య, సీనియర్ నాయకులు అల్లావుద్దీన్ వార్డు సభ్యులు ముజీబ్ ఫయాజ్, జాన్ కిషోర్, మండల వైసీపీ వైస్‌ప్రెసిడెంట్ సవలం కోటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల కేంద్రమైన తర్లుపాడు మండల ప్రాథమిక (హిందూ) పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నల్లబోతుల అల్లూరయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి-2 అచ్యుత సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఎస్టియు రాష్ట్ర నాయకులు బీసీహెచ్ వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ మండల నాయకులు ఆర్ నాసరయ్య, మండలంలోని ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు అల్లూరయ్య దంపతులను ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, కుటుంబ సభ్యులు, అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం పిచ్చయ్య, నెహ్రూ యూత్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పుల్లయ్య, ఉపాధ్యాయులు నజీర్, వెంకటేశ్వర్లు, కృష్ణకుమారి, మస్తాన్, విజయ తదితరులు పాల్గొన్నారు.

'బూచేపల్లి' ఆశీర్వాదం

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని టీచర్స్ కాలనీలో వైసీపీ కార్యకర్త వెన్నపూస శేషిరెడ్డి కుమార్తె పుష్పాలంకరణ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని ఆశీర్వదించారు. ఆమె వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ


ప్రజాశక్తి-కంభం రూరల్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంగంగుంట్లలో రెండు జతల యూనిఫామ్, షూస్, బ్యాగ్, సాక్స్, బెల్ట్‌లు జడ్పిటిసి కొత్తపల్లి జ్యోతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ వీటిని సక్రమంగా వినియోగించుకొని మంచి విద్యాప్రమాణాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొత్తపల్లి శ్రీనివాసు లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో టెక్స్ట్ బుక్స్ నోట్ బుక్స్, కూడా ప్రభుత్వం ఉచితంగా అందచేస్తోందని తెలిపారు. వీటిని బాగా ఉపయోగించుకొని చదివి మంచి భవిష్యత్తు పొందాలని కోరారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి మనుమాచు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అన్ని సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యా యులు గని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట స్టడీఅవర్ నిర్వహిస్తున్నా మని, ప్రతి విద్యార్థి చేత డైరీ రాయిస్తున్నామని తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎస్ కోటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యులు దేవుళ్లతో సమానం: బూచేపల్లి

డాక్టర్ హృదయరాజుకు డాక్టర్ జవహర్ వైద్యసేవా పురస్కారం అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

వైద్య వృత్తి మహోన్నతమైనదని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. జాతీయ డాక్టర్స్‌డే సందర్భంగా జవహర్ నర్సింగ్ హోం, లయన్స్ క్లబ్, జెవివిల ఆధ్వర్యంలో స్థానిక జె అండ్ ఎం ఫంక్షన్ హాలులో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన డాక్టర్ బందా జవహర్ వైద్య సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సభకు డాక్టర్ బి రాకేష్ అధ్యక్షత వహించారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తూ ప్రజాసేవ చేస్తున్న డాక్టర్ బందా జవహర్ అభినందనీయులన్నారు. పేదల వైద్యునిగా ప్రఖ్యాతిగాంచిన జవహర్‌ను ఆదర్శంగా తీసుకొని సేవలందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జవహర్ మాట్లాడుతూ రావినూతల గ్రామంలో గత 53 ఏళ్లుగా గ్రామీణ వైద్యునిగా సేవలందిస్తున్న డాక్టర్ ఈడ్పుగంటి హృదయరాజును పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి ఏడాది డాక్టర్స్ డే సందర్భంగా పురస్కారం అందజేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా రూ.లక్ష విలువ చేసే వెండి పురస్కారం డాక్టర్ హృదయరాజుకు అందజేశారు. ప్రశంసాపత్రం అందజేకసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్ ఆర్ లక్ష్మినారాయణ, మాజీ గవర్నర్ పి విజయకుమారరెడ్డి, డాక్టర్ మణిమాల, డాక్టర్ విద్యాశంకర్, డాక్టర్ బి రాకేష్, డాక్టర్ బి శారద, డాక్టర్ ఉషారాణి, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నూనె హేమసుందరరావు, ఎస్ అంజిరెడ్డి, చలువాది పార్థసారథి, చలువాది బదరీ నారాయణ, జెవివి జిల్లా కార్యదర్శి జయప్రకాష్, డివిజన్ కార్యదర్శి చలువాది రమేష్, మండల అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు, ఫాక్టరీ ఓనర్సు అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ మస్తాన్‌రెడ్డి, యూటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె అక్బర్, చలువాది శ్రీను, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, పూసపాటి వెంకటరావు, టి రామారావు, ఎపిటిఎఫ్ నాయకులు జెయాకోబు, వైద్యులు పాల్గొన్నారు.



డాక్టర్ ఇ హృదయరాజుకు అవార్డు అందజేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ బి జవహర్

శ్రావణి వెంకటేశ్వర్లుకు మాతృవియోగం

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ప్రజాశక్తి-పొదిలి

స్థానిక వైసీపీ సీనియర్ నాయకులు, కాపు సంఘం నాయకులు వెలిశెట్టి వెంకటేశ్వర్లు (శ్రావణి) మాతృమూర్తి శ్రీమతి వెలిశెట్టి కాశమ్మ(83) సోమవారం తెల్లవారు జామున మృతిచెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ తెల్లవారు జామున స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలోని చిన్న కుమారుడు నారాయణ ఇంటిలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు పురప్రముఖు లు, శ్రావణి మిత్రులు, బంధువులు పాల్గొనగా స్థానిక శ్మశాన వాటికలో ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు శ్రావణి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కొలుపుల్లో 'కోటపాటి'

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని వెంగలాయపల్లిలో నిర్వహిస్తున్న నాగారపమ్మ కొలుపులలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం కార్యకర్తలతో మాట్లాడారు. ప్రతి కార్యకర్త కృషి చేసి మెజార్టీ తీసుకొచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ విధంగా కోటపాటి జనార్ధన్ అందరు కార్యకర్తలతో కలిసి ఆప్యాయంగా మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కూడా తెలుగుదేశం విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈయన వెంట లింగసముద్రం పార్టీ అధ్యక్షులు వేముల గోపాల్‌రావు, వెంగలాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-సిఎస్ పురం

ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళీశ్వర తెలిపారు. సోమవారం శీలంవారిపల్లిలోని లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల పరీక్షల ఫలితాల గురించి అడిగి తెలుసుకున్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఎంపీసీ విభాగంలో 456 మార్కులు, బైపిసి విభాగంలో 419 మార్కులు సాధించిన గోగుమహాలక్ష్మి, ఖానగారి రేవతిలను ప్రత్యేకంగా అభినందించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు. ఆయన వెంట ఎంఇఓ-2 రాజాల కొండారెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్లో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని పోలీసు శాఖ సోమవారం నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దే శించి డిఎస్‌పి ఆర్ రామరాజు మాట్లాడుతూ చట్టాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచిం చారు. ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా కొన్ని చట్టా లను ప్రభుత్వం సవరించిందని వాటిని ప్రజలు తెలుసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని చట్టం ప్రకారం నడుచు కోవాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ డి వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ త్యాగరాజు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా రామచంద్రరావు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఇన్‌చార్జి ఎంపీడీఓగా సిహెచ్ రామచంద్రరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న గంజికుంట కృష్ణయ్య గత నెల 30న పదవీ విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో వెలిగండ్ల ఎంపీడీఓ సిహెచ్ రామచంద్రరావును ఇన్‌ఛార్జి ఎంపీడీఓ గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

మున్సిపల్ స్థలాన్ని కాపాడండి: సిపిఎం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పట్టణ నడిబొడ్డున అన్న క్యాంటీన్ పక్కన గల సర్వే నెంబర్ 494/బి4లోని మున్సిపల్ స్థలాన్ని పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించుకొని, అక్రమ నిర్మాణాలు చేసిన విషయం తెలిసిందే. వెంటనే ఈ స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించి మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం సిపిఎం నాయకులు మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సోమయ్య మాట్లాడుతూ సదరు స్థలం పూర్తిగా మున్సిపల్ బెటర్మెంట్ అవసరాల కోసం మార్కాపురం హౌసింగ్ క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ వారు కేటాయించారని, ఆ స్థలంలో అన్న క్యాంటీన్, సచివాలయం కూడా ఉన్నాయని తెలిపారు. ఇటువంటి స్థలాన్ని పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు అక్రమంగా ఆక్రమించుకుని తప్పుడు దస్త్రాలను పుట్టించి రిజిస్టర్ చేయించుకున్నారని, అందులో రూములు కూడా నిర్మించుకొని ప్రతి నెలా డబ్బులు వసూలు చేసుకుంటూ ఆదాయ వనరుగా మార్చుకున్నాడని అన్నారు. అయినా మున్సిపల్ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమని అన్నారు. కేవలం కబ్జాదారుడితో లాలూచీపడి మౌనంగా ఉన్నారని, వెంటనే సదరు స్థలాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ కిరణ్ వెంటనే విచారణ చేపట్టి తమ వద్ద ఉన్న దస్త్రాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డికెఎం రఫీ, గుమ్మ బాలనాగయ్య, పందిటి రూబెన్, కాశయ్య, విజయ్, నాగరాజు, పి మల్లికార్జున, వందన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మార్కాపురం డిఎస్పి పి బాలసుందర్రావు

వృద్ధురాలు దారుణ హత్యకు గురైన ఘటన మండల పరిధిలోని వేమలకోట గ్రామంలో సోమవారం తెల్లారుజామున జరిగింది. అందిన వివరాల ప్రకారం.. వేములకోట గ్రామానికి చెందిన కన్నెసాని నారాయణ మ్మ(60) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆమె అల్లుడు శ్రీను అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి నిద్రిస్తున్న నారాయణమ్మ గొంతును కత్తితో కోసి హతమార్చాడు. ఇదే వ్యక్తి 9 సంవత్సరాల క్రితం మృతురాలి కుమార్తెను సైతం రోకలిబండతో తలపై మోది హత్య చేశాడు. అప్పుడే ఒక సైకోలా మారి మీ కుటుంబంలో అందరినీ చంపుతానని, మిగతా కుటుంబ సభ్యుల ను హెచ్చరించి భయభ్రాంతులకు గురి చేసి వెళ్లాడు. తీరా సోమవారం తెల్లవారు జామున వేములకోట గ్రామానికి వచ్చిన శ్రీను నారాయణమ్మ నిద్రిస్తున్న ఇంట్లోకి వెళ్లి తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె గొంతును కోసం కోసి హత్య చేశాడు. అంతటితో ఆగకుండా హైదరాబాదులో నివాసం ఉంటున్న మృతురాలి మూడో కుమారుడైన షేక్షావలికి ఫోన్ చేసి మీ అమ్మను కత్తితో గొంతు కోసి చంపేశానని, రక్తపు మడుగులో పడి ఉందని వచ్చి చూసుకో అంటూ చెప్పాడు. దీంతో అతను హుటాహుటిన ఘటన గురించి మిగిలిన కుటుంబ సభ్యులకు తెలుపగా వారు ఇంట్లోకి వెళ్లి చూడగానే అప్పటికే నారాయణమ్మ మృతి చెంది ఉంది. ఘటన గురించి సమాచారం అందుకున్న మార్కాపురం డిఎస్‌పి బాలసుందర్రావు, సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఎంకటేశ్వర నాయక్ హుటాహుటిన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

రిపోర్టర్‌పై దాడి..

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



గాయపడిన సత్యం

గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామంలో స్వతంత్ర న్యూస్ ఛానల్ రిపోర్టర్ సత్యంపై అదే గ్రామానికి చెందిన ఆరవీటి శ్రీను, అయన కుమారుడు మహేష్ వారి అనుచరులు దాడి చేశారు. దాడి జరుగుతున్న దృశ్యాలను చిత్రీకరిస్తున్న ఐ న్యూస్ రిపోర్టర్ మున్నాపై కూడా దాడి చేసి మొబైల్ లాక్కుని పగులగొట్టారు. ఈ మధ్యకాలంలో గిద్దలూరు పోరుమామిళ్ల ప్రధాన రహదారి పక్కన ముళ్లపాడు గ్రామం వద్ద అక్రమ లే అవుట్ వెలసింది. దాని తాలూకు వివరాలు గ్రూపులో పెట్టాడని రిపోర్టర్ సత్యంపై కక్ష కట్టి దాడి చేసినట్లు సమాచారం. గాయాలపాలైన విలేకరి సత్యం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న విలేకరిని రాజకీయ నాయకులు, రిపోర్టర్లు కలిసి పరామర్శిస్తున్నారు. ముండ్లపాడులో పాత్రికే యులపై దాడి జరిగిన ప్రాంతంలో ఉన్న 3 సీసి కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను తొలగించే పనిలో నిందితుల కుటుంబ సభ్యులు ఉన్నట్లు సమాచారం.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గిద్దలూరు: ఐ న్యూస్ మున్నా, స్వతంత్ర టీవీ పాత్రికేయులపై దాడిచేసి, వారిపై హత్యాయత్నానికి యత్నించిన వారిపై అటెంప్ట్ మర్డర్ కింద కేసు నమోదు చేయాలని పాత్రికేయులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గిద్దలూరు అర్బన్ సీఐ సోమయ్యకు స్థానిక పాత్రికేయులు వినతి పత్రం అందజే శారు. వారు చేసే తప్పులను ఎత్తి చూపితే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని పాత్రికేయు లపై దాడిచేసి, వారిపై హత్యాయత్నానికి యత్నించిన ముండ్లపాడు గ్రామానికి చెందిన ఆరవీటి శ్రీను అతని కుమారుడు మహేష్, అతని సోదరుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సిఐ ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జూపల్లి కోటేశ్వరరావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-దర్శి



జూపల్లి కోటేశ్వరరావు రత్నకుమారి దంపతులను సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు ఉద్యోగులు

స్థానిక ఆచార్య నాగార్జున ఎంజి రంగా యూనివర్సిటీ పరిధిలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో 36 సంవత్సరాలుగా టైం స్కేల్ ఉద్యోగిగా పనిచేసిన జూపల్లి కోటేశ్వరరావు సేవలు మరవలేనివని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి సంధ్యారాణి, శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ అన్నారు. సోమవారం జూపల్లి కోటేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంధ్యారాణి మాట్లాడుతూ జూపల్లి కోటేశ్వరరావు నిరంతరం పరిశోధన స్థానంలో టైం స్కేల్ ఉద్యోగిగా అందరి మన్ననలను పొందిన వ్యక్తిగా కొనియాడారు. అనంతరం జూపల్లి కోటేశ్వరరావు సతీమణి రత్నకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ భారతి, ప్రజాసంఘాల నాయకులు సంఘ సేవకులు జివి రత్నం, అట్లూరి రామారావు, సందు వెంకటేశ్వరరావు, ప్రేమకుమార్, మోషే, తెనాలి రవిబాబు, రమణయ్య, రామ్మోహన్, ఉపాధ్యాయులు బసవయ్య, తిరుపతి, స్వాములుతోపాటు వ్యవసాయ పరిశోధన స్థానం ఉద్యోగులు, కృషి విజ్ఞానం కేంద్రం ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, పలువురు విలేకరులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉద్యమాలే కొరటాలకు నిజమైన నివాళి

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - బాపట్ల

రైతు, చేనేత సమస్యల పరిష్కారానికి చేసే ఉద్యమాలే కొరటాలు సత్యనారాయణకు నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. కామ్రేడ్ కొరటాల 18వ వర్ధంతిని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కొరటాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పూర్వ కార్యదర్శి, పోలిట్‌బ్యూరో మాజీ సభ్యులు, రైతు, వ్యవసాయ కార్మిక, చేనేత కార్మిక ఉద్యమ సారథి కొరటాలని అన్నారు. ఆయన ఉమ్మడి గుంటూరు జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో 1923 సెప్టెంబర్ 24న భూస్వామ్య కుటుంబంలో జన్మించారని అన్నారు. విద్యార్థి దశలోనే 14ఏళ్ల వయసులో డిటెన్షన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో ప్రజా జీవితంలోకి ప్రవేశించారని, 2006 జులై 1న అనారోగ్యంతో మరణించే వరకు ఏడు దశాబ్దాల పాటు ఎర్రజెండా చేత పట్టుకుని అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధ కాలంలో నాలుగేళ్లు అజ్ఞాత జీవితం గడిపారని అన్నారు. అజ్ఞాత జీవితంలో ఉండగా 1948లో అరెస్టు చేసి మూడేళ్ళకు పైగా బళ్లారి, కడలూరు జైళ్ళలో నిర్బంధించారని అన్నారు. చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా భూపోరాటం చేశారని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్రంలో కరువు, తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా బాధితుల పక్షాన నిలబడి ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకునిగా బంజరు భూములు పంచాలని, కూలి రేట్ల పెంచాలని, ఉపాధి వంటి సమస్యలపై ఉద్యమాలు చేశారని అన్నారు. చేనేత కార్మికుల మజూరి, రంగుల ధరలు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు వంటి సమస్యలపై ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాలు విధానాలను రూపొందించాలని కొరటాల స్ఫూర్తితో సమరశీల రైతు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. అదే కామ్రేడ్ కొరటాలకు అర్పించే నిజమైన నివాళని అన్నారు. వై భాస్కరరావు, కె శరత్ బాబు, షేక్ సుభాని, జి ప్రతాప్ కుమార్, శ్రీను, టి సుభాషిణి పాల్గొన్నారు.


కొరటాల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం కార్యదర్శి గంగయ్య

రేపల్లె : సీపీఎం నేత కామ్రేడ్ కోరటాల సత్యనారాయణ 18వ ర్ధతిసభ స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కొరటాల చిత్రపటానికి సీపీఎం నాయకులు కె అశ్విరాథం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ రేపల్లె నుంచి 1962, 1978లో 2సార్లు శాసన సభకు ఎన్నికయ్యారని అన్నారు. సభలో సిపిఎం నాయకులు కెవి లక్ష్మణరావు, జి దాని యేలు, డి శ్రీనివాసరావు, ఆగస్టిన్, జి ధర్మ రాజు, యు నాంచారయ్య పాల్గొన్నారు.

కొల్లూరు : అనంతవరంలో సిపిఎం అగ్రనేత కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతి సందర్భంగా సిపిఎం నాయకులు గోళ్ళ రాంబాబు, బొనిగల సుబ్బారావు ఆధ్వర్యంలో కొరటాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బొనిగల ప్రసాద్, మేడికొండ గోవర్ధన్, ఎద్దు ప్రసాద్, గద్దె సుధీర్, వాగోలు మాధవి పాల్గొన్నారు.

మేదరమెట్ల : కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతి సందర్భంగా స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం ఆంజనేయులు, ప్రజా నాట్య మండలి పూర్వ గౌరవ అధ్యక్షులు బి దశరథ, ఉపాధ్యాయ నాయకులు కె పోతురాజు, వై రవీంద్రబాబు, జయమ్మ, వైకుంఠం, బాబురావు పాల్గొన్నారు.


భట్టిప్రోలు : సిపిఎం నేత కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద కొరటాల చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. సిపిఎం నాయకులు పి అహరోన్, బట్టు నాగమల్లేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పి మనోజ్, కె రామారావు పాల్గొన్నారు.


పెన్‌పాల్ లెటర్స్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు

ఆదర్శవంతంగా ఐలవరం ఉన్నత పాఠశాల

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేస్తూ దేశ, విదేశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో సంభాషణలు జరుపుతున్న ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు అమెరికా నుండి వచ్చిన పెన్పాల్ లెటర్స్ సోమవారం ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు. గత ఏడేళ్లుగా ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ కృషితో వినూత్న రీతిలో చేపడుతున్న విద్యాబోధన ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల మక్కువ ఏర్పడిందని అన్నారు. స్కైప్ ద్వారా ఇక్కడ విద్యార్థులు విదేశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో సంభాషిస్తూ అక్కడ స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకుని విద్యార్థుల్లో నైపుణ్యత పెరుగుతుందని అన్నారు. అమెరికాకు చెందిన థామస్ విజ్నెండ్ పెన్పాల్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆంగ్ల ఉపాధ్యాయులు పచ్చారు హరికృష్ణను, పాఠశాల హెచ్‌ఎం మాచర్ల మోహనరావును అభినందించారు.


ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు ఎస్ఎఫ్ఐ వినతి పత్రం

విద్యార్థి సమస్యలపై ఆనందబాబుకు వినతి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని విద్యార్థులకు ఇంటర్ విద్యను అందించిన జివిఎస్ఆర్ అండ్ ఎఎస్ఆర్ కళాశాలను తిరిగి ఎయిడెడ్‌గా కొనసాగించాలని, ప్రభుత్వ లెక్చరర్లను నియమించాలని కోరుతూ ఎమ్మెల్యే నక్క ఆనందబాబుకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి మనోజ్ కుమార్ సోమవారం కొల్లూరులో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి మనోజ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్న ఎయిడెడ్ కళాశాల వ్యవస్థలను రద్దు చేయడం వలన పేద విద్యార్థులకు ఉచిత విద్య దూరమైందని అన్నారు. జివిఎస్ఆర్ అండ్ ఎఎస్ఆర్ జూనియర్ కళాశాలను ఎయిడెడ్ కళాశాలగా కొనసాగించాలని కోరారు. ఎంఎల్ఎ ఆనందబాబు మాట్లాడుతూ నాటి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసిందని అన్నారు. కొల్లూరు కళాశాల విషయమై ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రితో మాట్లాడతానని ఎస్ఎఫ్ఐ నాయకులకు చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

సంక్షేమ పథకాల పండుగ వాతావరణం ప్రారంభమైందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని నడింపల్లిలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు మంత్రి స్వయంగా పెన్షన్లు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే హామీ ఇచ్చిన పథకాలన్ని ప్రారంభిస్తామని అన్నారు. ప్రజా శ్రేయసే పరమావధిగా తమ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పూషడపు కుమారస్వామి, ఎంఆర్‌కె మూర్తి, దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, గోగినేని వసుధ సుబ్బారావు, పులి కొండలు, నాగుల పున్నారావు, పేరం శంకర్ బాబు పాల్గొన్నారు.

హైవే నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపాలి


డిఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న సిండికేట్ కాలనీవాసులు

ప్రజాశక్తి - బాపట్ల

పిడుగురాళ్ల – వాడరేవు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఈపురుపాలెం పంచాయితీ సిండికేట్ కాలనీ రోడ్ మర్జిన్లో నివాస గృహాలను తొలగించాలని రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం డిఆర్ఓ సత్తిబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి కొండయ్య మాట్లాడారు. బాధితులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయ స్థలాలు చూపకుండా, అధికారులు ఎవరూ లేకుండా రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు చెట్లు కొట్టే పేర్లతో వచ్చి పేదలు నివాసాలు ఉంటున్న ఇళ్ళను ఖాళీ చేయమని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. సమస్యపై సత్వరమే స్పందించి చీరాల ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చేవరకు పేదలను తొలగించ వద్దని డిఆర్ఓ సూచించారు. అక్కడ నివాసాలు ఉంటున్న పేదలజోలికి కాంట్రాక్టర్లు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు రోడ్డు కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని చీరాల ఆర్డీఓకు డిఆర్ఓ సూచించారని కొండయ్య తెలిపారు. రహదారి నిర్మాణంలో గృహాలు కోల్పోతే నిర్వాసితులకు ప్రత్యామాయ స్థలాలు ఇచ్చేవరకు ఎవరు కదిలించరని ఇన్చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ భరోసా ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, ముప్పిరి శ్రీను, ఇస్సాకు, పడవటి కోటేశ్వరి, అనిత, రాణి, సామ్రాజ్యం, తిరుపాలమ్మ, రామలక్ష్మి, సీత పాల్గొన్నారు.

చీరాల : వాడరేవు – పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో కోసం ఈపురుపాలెం సిండికేట్ కాలనీ వాసులను కాంట్రాక్టర్లు బలవంతంగా కాళీ చేయించాలని దౌర్జన్యం చేస్తున్నారని, తక్షణమే ఇళ్ల తొలగింపు ప్రక్రియను నిలిపేసి ప్రత్యామ్నయం చూపాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారుకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, పి కొండయ్య మాట్లాడారు. నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నం చూపకుండా, ఎలాంటి పరిహారం ఇవ్వకుండా ఎలా ఖాళీ చేయిస్తారని ప్రశ్నించారు. కలెక్టర్, ఆర్‌డిఒ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు.


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు



ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి మనోజ్‌కుమార్

4న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - కొల్లూరు

నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 4న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి మనోజ్ కుమార్ కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష దేశ చరిత్రలో కనీ, విని ఎరగని రీతిలో ఈ ఏడాది అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నీట్ పరీక్ష నిర్వహించే ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు మొరపెట్టుకున్నప్పటికీ స్పందన లేకపోవడం దారుణమని అన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎన్‌టిఎను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులకు న్యాయం చేస్తానని, మరల నీట్ పరీక్ష నిర్వహిస్తామని ఆయన ప్రకటన ఇవ్వకపోవడం బాధ్యతా రాహిత్యమని అన్నారు. పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం పేరట దేశ వ్యాప్తంగా పాఠశాలలు మూసివేత ఆపాలని డిమాండ్ చేశారు. 4న దేశ వ్యాప్తంగా జరిగే బంద్ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆలోచనా శక్తిని పెంచుకోవాలి

ప్రజాశక్తి - వేటపాలెం

పాలిటెక్నిక్ విద్యార్థులు తాత్విక ఆలోచన ధోరణి అలవాటు చేసుకోవాలని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రెటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. తమ కళాశాల్లో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో చేరటం విద్యార్థులకు ఒక గొప్ప అవకాశం అని, సద్వినియోగ చేసుకోవాలని తెలిపారు. పాలిటెక్నిట్ విద్యార్థులు ఎక్కువ నైపుణ్యం ప్రదర్శించగలరని తెలిపారు. అనుభజ్ఞులైన అధ్యాపకులు కళాశాల్లో చేరిన ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు కమ్యునికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న సెక్రటరీ వనమా రామకృష్ణరావు

డయేరియాను నిర్మూలిద్దాం: వేగేశన

ప్రజాశక్తి - బాపట్ల

డయేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరు శుభ్రమైన మంచినీటిని తాగాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సూచించారు. డయేరియా నిర్మూలన, అవగాహన ర్యాలీని మున్సిపల్ హైస్కూల్ నుండి వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మతో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్ వరకు ర్యాలి నిర్వహించారు. అక్కడ విద్యార్థులు భారీ సంఖ్యలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ గంధం రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.


టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి వీరాంజనేయస్వామి, దామచర్ల సత్య


కనిగిరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి



తర్లుపాడు మండలంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మార్కాపురం ఉప కలెక్టర్ రాహుల్ మీనా

రూ.4వేల పెన్షన్.. దేశంలోనే ఓ చరిత్ర

ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-దర్శి

భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నాయకత్వాన రూ.4 వేల చొప్పున పెన్షన్ ఇవ్వడం, మూడు నెలల పెంచిన మొత్తం కలిపి మొత్తం రూ.7 వేల ఇవ్వటం ఒక చరిత్ర అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం మండలంలోని రాజంపల్లిలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అధ్యక్షతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీని ఇంటింటికీ తిరిగి మంత్రి డోలా వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో తిరిగి 15 ఇళ్లలోని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ పేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, రాష్ట్రంలో 65 లక్షల 18 వేల మందికి పండగ వాతావరణంలో సచివాలయం పరిధిలో ఉన్న ఉద్యోగులకు మొదటి తారీకున ఇవ్వడం ఇది గొప్ప చరిత్ర అన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం పెన్షన్లు ఇవ్వకుండా వృద్ధులను, వితంతువులను ఇబ్బంది పెట్టిందన్నారు. కలెక్టర్ తమిమ్ అన్సారియా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఆరు గంటల నుండి పెన్షన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ పరిధిలో 30,676 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి వీరాంజనేయస్వామికి, కలెక్టర్ తమీమ్ అన్సారీయాకి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కనిగిరి ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, పిడి వసుంధర, ఎంపిడిఒ హనుమంతరావు, తహశీల్దార్ సుజాత, రాజంపల్లి నాయకులు, మాజీ ఎంపిపి పనిదపు వెంకట్రావు, వనం అన్నపూర్ణ, విజయ్, ఉపసర్పంచ్ వజ్జ నాగమణి, రామకృష్ణ, వెంకట్రావు పాల్గొన్నారు.

హామీలను సమర్థవంతంగా అమలు చేస్తాం


ఒంగోలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జనార్ధన్

రేపల్లె: ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలుచేస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు పంపిణీని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. రేపల్లె, నిజాంపట్నం మండలాల్లో ఆయన పర్యటించారు. పింఛన్ లబ్ధిదారులైన వద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు ఆయన చేతుల మీదుగా నగదు అందజేశారు. నిజాంపట్నం జల్లాబజార్లో జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సిహెచ్ శ్రీధర్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఆగస్టు నెల కల్లా రాష్ట్రంలో మూతబడిన అన్నా క్యాంటీన్లను ప్రారంభించి పేదలకు అందుబాటులోకి తెచ్చే విధంగా యుద్ధ ప్రాతిపదికన కషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ హేలా షారోన్, ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విజయవంతంగా పెన్షన్లు పంపిణీ

పంగులూరు: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణం చేసిన మొదటి రోజే తీసుకున్న పెన్షన్ పెంపు నిర్ణయాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని కొండమంజులూరు బీసీ కాలనీలోని గుంజి రమణయ్య కుమారులు గుంజి వెంకట విజయ్, గుంజి భాను ప్రకాష్ ఇంటికి వెళ్లి వికలాంగ పెన్షన్‌ను మంత్రి రవికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుండి ఎవరూ పెన్షన్ తీసుకోవడానికి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. ఎదురుచూడాల్సిన పనిలేదని అన్నారు. ఇంటి దగ్గరికి వచ్చి సచివాలయ సిబ్బంది పెన్షన్లు


మార్కాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల

అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, మాజీ డైరీ చైర్మన్ బాలిన రామ సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, మండల ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, బొప్పుడి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ శివరాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యం: దామచర్ల

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలు నగరంలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే కూటమి పార్టీల లక్ష్యమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. ఒంగోలు నగరంలోని 16వ డివిజన్ బాలాజీ నగర్, 9వ డివిజన్‌లోని పులివెంకటరెడ్డి కాలనీ, 3వ డివిజన్ లోని ఎన్టీఆర్ కాలనీ, 50వ డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీ, 33వ డివిజన్‌లోని జడ్జీ కాలనీ, 27వ డివిజన్‌లోని జయరాం థియేటర్ ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేసి గ్రామ, వార్డు, సచివాలయ,క్షేత్ర స్థాయి సిబ్బందితో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు పండుగ వాతావరణంలో పెన్షన్ అందజేశారు.

మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, పెద్దారవీడు మండలం సానికవరంలో టిడిపి యర్రగొండ పాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, సంతనూతల పాడులో ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్, గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో మంత్రి వీరాంజనేయస్వామి, దామచర్ల సత్య, కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, తర్లుపాడు మండలంలో మార్కాపురం ఉప కలెక్టర్ రాహుల్ మీనా పింఛన్లు పంపిణీ చేశారు.


పెద్దారవీడు మండలం సానికవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు


సంతనూతలపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్


గిద్దలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ఆశావర్కర్ల శిక్షణా తరగతులకు లాల్ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి-పొదిలి

గత రెండు రోజులుగా ఆది, సోమవారాలలో పొదిలిలో జరుగుతున్న ప్రకాశం జిల్లా ఆశా వర్కర్ల శిక్షణా తరగతులకు హాజరైన దాదాపు రెండు వందల మంది ఆశా వర్కర్లకి భోజనాలు ఏర్పాటుకు లాల్ ఫౌండేషన్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. సోమవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో ఫౌండేషన్ తరపున అఖిబ్ అహమ్మద్ ఇచ్చిన చెక్కును వారి ప్రతినిధులుగా షేక్ రసూల్, బండి అశోక్, షేక్ బాజీ కరీముల్లాలు జిల్లా ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు ఐ రాఘవమ్మ, జిల్లా ప్రధాన పీ కల్పన, ఆశా వర్కర్లు పద్మ, ఎం పరిశుద్ధం, జే సుశీలకు ఆ చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు లాల్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియ చేశారు.


సాయం అందిస్తున్న లాల్ ఫౌండేషన్ ప్రతినిధులు


ప్రజాశక్తి సాహితీ సంస్థ మాజీ చైర్మన్, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు కొరటాల సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఏదుగుండ్లపాడులోని ఎడిషన్ కార్యాలయంలో నివాళు లర్పిస్తున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్, ప్రజాశక్తి జిఎం ఎంఎల్‌వి.ప్రసాదరావు, సిబ్బంది..
- ప్రజాశక్తి, మద్దిపాడు

మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తాం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మార్కాపురాన్ని నూతన జిల్లాగా ఏర్పాటు చేస్తామని టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టును కూడా వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. సోమవారం పెద్దదోర్నాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడేటప్పుడు రెడుసార్లు కరెంట్ పోవడంతో వైసీపీ వాళ్లు కావాలనే కరెంట్ తీశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు మాబు, అంబటి వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శేషాద్రి, నాగేంద్రబాబు, ఇస్మాయిల్, బాషా, మౌలాలి, జనసేన మండల కన్వీనర్ మురళితో పాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

షాపుల వేలం ద్వారా ఆదాయం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

షాపులు వేలం ద్వారా ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రం భైరవకోనకు రూ.3.31 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కందుకూరు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో భైరవకోనలో షాపుల నిర్వహణకు సోమవారం వేలం పాటలు నిర్వహించారు. ఆరు ఐటమ్స్‌కు వేలంపాటలు నిర్వహించగా మూడు ఐటమ్స్ వాయిదా పడినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో నర్రా నారాయణరెడ్డి, సిద్దు వెంకట్ రెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, ఆలయ పూజారి కంబాలదిన్నె వెంకట నరసయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


పాముల వారి కాలనీలో పేద ప్రజలతో మాట్లాడుతున్న ఊసా వెంకటేశ్వర్లు

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

పేదలందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం సిఎస్ పురంలోని పాముల వారి కాలనీలోని ప్రజలతో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ పట్టలతో వారు ఏర్పాటు చేసుకున్న నివాస గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం పోరాటాల ఫలితంగా దాదాపు 12 సంవత్సరాల క్రితం కొద్దిమంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఆ తర్వాత ఏ ప్రభుత్వం కానీ, అధికారులు కానీ పేదల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని పలుమార్లు ఎమ్మెల్యేగా దృష్టికి తీసుకెళ్లామని, రెవెన్యూ అధికారులకు అర్జీలు కూడా ఇచ్చామని, ఏ ఒక్కరు కూడా పేద ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం చంద్రబాబు పాలనపై పేద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ఈ ప్రభుత్వమైనా పేద ప్రజల గురించి పట్టించుకుని వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహులు, తిరుపతమ్మ, పోలయ్య పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు తమ గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి పొందాలని ఎఒ టి బాలాజీ గంగాధర్ తెలిపారు. బిపిటి 5204, ఎంటియు 1224 రకం సబ్సిడీ పోను 25కేజీలు రూ.920, ఎంటియు 1061 రకం 30కేజీలు సబ్సిడీ పోను రూ.1044 చెల్లించి పొందాలని కోరారు. రైతులు తమ ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్ తీసుకొని రావాలని కోరారు. విత్తనాలను కొనేటప్పుడు రైతులు తప్పనిసరిగా లాట్ నెంబర్, గడువు తేదీని చూసుకొని కొనాలని సూచించారు. తప్పనిసరిగా రసీదు పొందాలని చెప్పారు. మండలంలోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని సూచించారు.



వరి విత్తనాలు అందజేస్తున్న ఎఒ

భట్టిప్రోలు : మండలంలోని పల్లికోనలో బాపట్ల వ్యవసాయ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు వరి పంటపై వ్యవసాయ శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఆర్ బాల మురళీధర్ నాయక్, ఆర్ రాధాకృష్ణ రైతులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల సాగు ఆవశ్యకతను వివరించారు. చిరుధాన్యాల వినియోగం మనిషికి ఆరోగ్యానికి దోహదపడతాయని చెప్పారు. రైతులు వ్యవసాయం పట్ల అవగాహన కలిగి తక్కువ ఖర్చులతో అధిక దిగుబడులు సాధించే విధంగా మార్పులు చేసుకోవాలని చెప్పారు. రైతులకు బిపిటి 2858, నవారా విత్తనాల శాంపిల్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎఒ గొల్లపోతు మీరయ్య, వీఏఎలు యుగంధర్, గోకుల్ కృష్ణ, మాజీ సర్పంచ్ మండవ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

వేమూరు : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ప్రభుత్వం నుండి రాయితీపై వరి విత్తనాలు అందించేందుకు ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉన్నాయని ఎఒ సిహెచ్ సునీత తెలిపారు.

డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి -పర్చూరు

డయేరియాపై అవగాహన కలిగించాలని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. డయేరియా అవగాహన ర్యాలిని ఆయన ప్రారంభించారు.

రేపల్లె : డయేరియా అవగాహన ర్యాలీని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పట్టణంలోని 13వ వార్డులో జెండా ఊపి సోమవారం ప్రారంభించారు. రాజ్యలక్ష్మి థియేటర్, మున్సిపల్ ఆఫీస్ మీదుగా రైల్వే స్టేషన్, తాలూకా సెంటర్ వరకు ర్యాలి నిర్వహించారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రమేష్ సముద్రాల, డాక్టర్ జాన్ ప్రసాద్, డాక్టర్ అబ్దుల్ రెహ్మాన్, అంగన్‌వాడి సిడిపిఒ మాణిక్యమ్మ, సిఎంఎం విజయ కుమారి, హెల్త్ విజిటర్లు పద్మావతి, బుల్లెమ్మ, సూపర్వైజర్ శ్రీలక్ష్మి, మెప్మా సీఓలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. ఎంపీడీఒ శ్రీనివాసులురెడ్డి నల్లురిపాలెంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొరికపూడి నాంచారమ్మ పాల్గొన్నారు.

అద్దంకి : పట్టణంలో మోదేపల్లి, కాకానిపాలెం, గాజులపాలెం, అద్దంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అతిసార వ్యాధి నిర్మూలనపై డాక్టర్ మనోజ్, జయసింహ, శ్రీ హర్ష, మాధురి సిబ్బందితో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎ నాగేశ్వరరావు, సూపర్వైజర్ సత్తార్, వెంకాయమ్మ, తబిత, జానీ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ప్రజలు అతిసార వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని పిహెచ్‌సి డాక్టర్ డిఎల్ పద్మజ, సిహెచ్ రామలక్ష్మీ సూచించారు. గ్రామంలో ర్యాలి నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.



అవగాహన ర్యాలీలో మంత్రి అనగాని సత్యప్రసాద్



అవగాహన ర్యాలీలో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

తిరుమలకు తెలుగుదేశం నేతల పాదయాత్ర

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్రంలో తెలుగుదేశం మరోసారి అధికారాన్ని చేపట్టడం, గొట్టిపాటి రవికుమార్ వరుసగా 5వ సారి విజయ సాధించి, మంత్రిగా ఎన్నిక కావడం పట్ల వెంకన్నకు మొక్కు చెల్లించుకునేందుకు తిరుమలకు పాదయాత్రగా సోమవారం బయలుదేరారు. టిడిపి రేణింగవరం నాయకుడు బోరెడ్డి ఓబులురెడ్డి నాయకత్వంలో 30మంది కార్యకర్తలు కాలినడకన తిరుమలకు బయలుదేరారు. స్థానికంగా ఉన్న పోలేరమ్మ, నాంచారమ్మ, గంగమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి బయలుదేరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, మాజీ డైరీ చైర్మన్ బాలిన రామసుబ్బారావు, చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, రామకూరు ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్, గరిమిడి జగన్మోహనరావు, వలపర్ల సుబ్బారావు, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, గుర్రం ఆదిశేకర్, అలవలపాడు సర్పంచ్ జకరయ్య, దాసరి హనుమంతరావు గౌడ్, గొల్లపూడి శేషగిరి పాల్గొన్నారు.

కొల్లూరు : టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం సాధించిన సందర్భంగా మాజీ ఎంపీపీ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూదన ప్రసాద్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతికి 12రోజులు 62మంది బృందంతో మహా పాదయాత్రగా బయలుదేరారు. స్థానిక విఘ్నేశ్వర ఆలయంలో 116 కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి పూజలు చేశారు. శాసన సభ్యులు నక్క ఆనందబాబు సంఘీభావం తెలిపారు.



పాదయాత్రగా బయలుదేరిన తెలుగుదేశం నాయకులు

పర్చూరు : మండలంలోని దేవరపల్లిలో కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పర్చూరు శాసన సభ్యులుగా ఏలూరి సాంబశివరావు 3వ సారి హ్యాట్రిక్ విజేతగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే శ్రీవెంకటేశ్వర స్వామి చెంతకు పాదయాత్రతో 30మంది యువకులు బయలుదేరారు. యాత్రను ఏలూరి సాంబశివరావు జెండా ఊపి ప్రారంభించారు. కాపు రవిచంద్ర, ఎంపీటీసీ కొమ్మాలపాటి సురేష్, కొరిటాల సురేష్, గండు నాగేశ్వరరావు, తోకల రాజశేఖర్, దొప్పలపూడి రాంబాబు, తోకల వేణుబాబు ఉన్నారు.



మూడు చక్రాల స్కూటర్ బహుకరిస్తున్న టిడిపి నాయకులు

మూడు చక్రాల స్కూటర్ అందజేత

ప్రజాశక్తి - పంగులూరు

మూడు చక్రాల స్కూటర్‌ను ఇస్తానని ఎన్నికలకు ముందు ఒక వికలాంగుడికి ఇచ్చిన మాట ప్రకారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్కూటర్‌ను బహుకరించారు. మండలంలోని రామకూరుకు చెందిన కొమరగిరి రత్తయ్య అనే వికలాంగునికి మూడు చక్రాల స్కూటర్ సోమవారం అందజేశారు. ఎన్నికలకు ముందు గొట్టిపాటి రవికుమార్ రామకూరు గ్రామానికి వచ్చాడు. ఆ గ్రామానికి చెందిన వికలాంగుడు కొమరగిరి రత్తయ్య తాను వైకల్యం వల్ల ఇబ్బంది పడుతున్నానని, నడవలేక పోతున్నానని, తనకు మూడు చక్రాల వాహనాన్ని ఇచ్చి ఆదుకోవాలని కోరాడు. ఎన్నికల అనంతరం కచ్చితంగా తాను మూడు చక్రాల వాహనాన్ని అందజేస్తానని రత్తయ్యకు రవికుమార్ హామీ ఇచ్చారు. ఆ మేరకు మూడు చక్రాల స్కూటర్ కొని, గ్రామ తెలుగుదేశం నాయకులు ద్వారా రత్తయ్యకు అందజేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ఈ మేరకు తెలుగుదేశం నాయకులు, పంచాయతీ ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్, తెలుగు యువత నాయకుడు మానం వెంకట్రావు, సచివాలయ సిబ్బంది గ్రామంలోని గిరిజన కాలనీకి వెళ్లి వికలాంగుడైన కొమరగిరి రత్తయ్యకు మూడు చక్రాల స్కూటర్ అందజేశారు. తన సమస్యను గుర్తించి తనకు మూడు చక్రాల స్కూటర్‌ను పంపించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు, అందజేసిన తెలుగుదేశం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



విరాళం చెక్కు ఇఒ టి సుభద్రకు అందిస్తున్న దాతలు

శింగరకొండ ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానానికి రాతి ముఖ మండపం నిర్మాణానికి పట్టణానికి చెందిన ఆలపాటి లక్ష్మీనారాయణ, వెంకట పద్మావతి దంపతులు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి టి సుభద్రకు రూ.లక్ష116 విలువైన చిక్కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఇఒ వెంకట్రామయ్య

బోధన నైపుణ్యంపై శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

బోధన నైపుణ్యంపై ఉపాధ్యాయులకు స్థానిక ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో ఒక రోజు శిక్షణ సోమవారం నిర్వహించారు. పర్చూరు, చీరాల ఎంఈఓలు వెంకట్రామయ్య, సుబ్రహ్మణ్యేశ్వరరావు విద్యార్థులకు ఏ విధంగా పాఠాలు చెప్పాలో ఉపాధ్యాయులకు వివరించారు. టూల్స్ ఉపయోగించి విద్యార్థులకు బోధన చేయాలని అన్నారు. శిక్షణను గుంటూరు ఆర్జెడి లింగేశ్వరరెడ్డి, చీరాల డిప్యూటి డిఇఒ నిర్మల సందర్శించారు. శిక్షణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఆర్ హైస్కూల్ హెచ్‌ఎం ఈదర రాజశేఖర్ పాల్గొన్నారు.



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - మెదరమెట్ల

మండలంలోని రావినూతల పారిశుధ్య కార్మికులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నంగి సుబ్బారావు పుట్టినరోజు సందర్భంగా నూతన వస్త్రాలు బహుకరించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ హృదయనాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి విజయవీణ, రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళి సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, సందిరెడ్డి శ్రీనివాస రావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, షేక్ మొహమ్మద్ రఫీ, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, అళహరి హరిప్రసాద్, మోపర్తి వెంకటరావు, దామా వెంకటసుబ్బయ్య, యడ్లపల్లి నరసింహారావు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.4వేలకు పెన్షన్ పెంచడం అభినందనీయమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మాచర్ల నాగరాజు, దీపాల ప్రసాదు, జొన్నాదుల రెడ్డియ్య, డోలా శివకుమార్, జగ్గారపు పాపారావు, వామనపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



అఖిలేష్ యాదవ్ పుట్టినరోజు వేడుకల్లో బీసీ నాయకులు

ఘనంగా అఖిలేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - బాపట్ల

సమాజ్ వాది పార్టీ జాతీయ అధ్యక్షులు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ 52వ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, విలియంబుత్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్యామ్ లివింగ్ స్టన్, సిపిఐ నాయకులు జెబి శ్రీధర్, సిఐటియు నాయకులు కె శరత్, బీసీ నాయకులు పివి శ్రీనివాసరావు, బోయిన శ్రీనివాసరావు, కె చరణ్, దర్శి భాస్కరరావు, మద్దిబోయిన తాతయ్య, వడ్లమూడి భాస్కరరావు, మోర్ల వెంకటేశ్వరరావు, కాంద్రు శరత్ కుమార్, పి సాంబశివరావు, దూళిపూడి బసవయ్య పాల్గొన్నారు.

పద్మ భాస్కర్ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని ఈపురిపాలెంకు చెందిన టీస్టాల్ నిర్వాహకుడు షేక్ సుభాని కుమార్తె షేక్ ఫాతిమా తీవ్ర కడుపు నొప్పితో ఆపరేషన్ చేయాల్సి రావడంతో ఆమె వైద్య ఖర్చులకు రూ.70వేలకుపైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలపారు. దీంతో దిక్కు తోచని స్థితిలో ఆమె పద్మ భాస్కర్ ఫౌండేషన్‌ను ఆశ్రయించగా ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ స్పందించి రూ.6వేల నగదును అందజేశారు.

పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ



అధికారులతో కలిసి పెన్షన్ అందిస్తున్న నరేంద్ర వర్మ



పెన్షన్ల పంపిణీలో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - బాపట్ల

ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి మండలంలోని స్టువర్టుపురం, పాండురంగాపురం, జమ్ములపాలెం, బాపట్ల పట్టణం, కర్లపాలెం మండలం పేరలి, కర్లపాలెం, యాజలి, పిట్లవానిపాలెం మండలం చందోలు గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి రవీందర్, తహశీల్దారు శ్రావణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఈఓఆర్డి పులి శరత్ బాబు, జనసేన ఇన్‌ఛార్జి నామన శివన్నారాయణ పాల్గొన్నారు.

కొల్లూరు : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, జనసేన అధ్యక్షులు చలమయ్య, ఈఓ మల్లికార్జునరావు తోకలిసి కొల్లూరులో పంపిణీ చేశారు.

పంగులూరు : గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు తెలుగుదేశం నాయకులు పూలమాల వేసి పెన్షన్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ గద్దె అరుణ, తెలుగుదేశం నాయకులు అన్నంగి రవి, నూనె ఇశ్రాయేలు, మంద నాగేశ్వరరావు, పాలపర్తి లోకయ్య, ధారా కిరణ్ కుమార్, నూనె రాజేష్, అట్లూరి లాజర్, పాలపర్తి చిన్న శేషయ్య, తాతపూడి శ్యాంబాబు పాల్గొన్నారు.

అద్దంకి : మండలంలోని చినకొత్తపల్లి, వెంపరాల, గోవాడ, తిమ్మాయపాలెం, రామాయపాలెం, పార్వతీపురం, కోటి కలపూడి గ్రామాల్లో వృద్ధుల చేత కేక్ కట్ చేసి సిఎం చంద్ర బాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, గొట్టి పాటి రవికుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

యద్దనపూడి : పెన్షన్ల పంపిణీలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా మార్క్ ఫెడ్ మేనేజర్ కె కరుణశ్రీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఐఒఆర్‌డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలోని పుట్టావారిపాలెంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. కొప్పరం నెహ్రు నగర్ కాలనీలో టిడిపి నాయకులు అట్లా పెద్ద వెంకటరెడ్డి, చేవూరి వాసురెడ్డి, పూల రాము ఆధ్వర్యంలో పింఛన్లను అందజేశారు. ఏల్చూరులో మాజీ సొసైటీ అధ్యక్షులు డి గాలెయ్య ఆధ్వర్యంలో పింఛన్లను అందజేశారు.

వేమూరు : సిఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జూలై 1నుండి రూ.4వేలు పెన్షన్‌తో పాటు గడిచిన మూడు నెలలకు రూ.3వేలు కలిపి రూ.7వేలు పెన్షన్ పంపిణీ చేశారు. అక్కడక్కడ సర్వర్ సమస్యలు ఎదురైనప్పటికీ 90శాతంపైగా పంపిణీ పూర్తి చేశారు. మాజీ మంత్రి, ఎంఎల్ఎ నక్కా ఆనందబాబు కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు, జంపని గ్రామంలో పంపిణీ చేశారు.

కారంచేడు : పింఛన్లను 95 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ బి బాబురావు తెలిపారు. మండలంలో 6086మందికి పంపిణీ జరిగినట్లు తెలిపారు. తనతోపాటు తహశీల్దారు మెహర్ బాబు, ఈఓఆర్డి ఆర్ రమేష్ బాబు, ఎఓ లక్ష్మీనారాయణ పర్యవేక్షించినట్లు తెలిపారు. కారంచేడులో ఎఎంసి మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి, కంభంపాటి శ్రీనివాసరావు, పి ఆదిలక్ష్మి, నానీలు ప్రారంభించారు.

భట్టిప్రోలు : పెన్షన్ల పంపిణీని టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు బట్టు మల్లికార్జునరావు ప్రారంభించారు. ఐలవరంలో టిడిపి నాయకులు మాచర్ల నాగరాజు ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నీలం దేవరాజ్, ఎంపీడీఓ మల్లికార్జునరావు, తహశీల్దారు ఐ మునిలక్ష్మీ పాల్గొన్నారు.

నగరం : మండలంలోని చినమట్లపూడి, పెదమట్లపూడి గ్రామాల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్ పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, మాజీ జడ్పిటిసి మేక వెంకట శివరామకృష్ణ, పెదమట్లపూడి మాజీ సర్పంచి లుక్క గుడారంకయ్య, తహశీల్దారు, ఎండీఓ పాల్గొన్నారు.

మేదరమెట్ల : బొడ్డువాణిపాలెంలో తహశీల్దారు పి సుశీల, ధైవాలరావూరు, రావినూతల గ్రామాల్లో ఏఓ పి శ్రీనివాసరావు, మేదరమెట్లలో పంచాయితీ కార్యదర్శి జె లక్ష్మీకాంత్ చేతుల మీదుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు.

ముండ్లమూరు : మండలంలోని 21పంచాయతీలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెంచిన రూ.4పెన్షన్ టిడిడి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి పంపిణీ చేశారు. సింగనపాలెంలో నేరుగా లబ్దిదారులను కలిసి అందజేశారు. కార్యక్రమంలో కడియాల లలిత సాగర్, కూరపాటి శ్రీనివాసరావు, మాజీ జడ్పిటిసి వరగాని పౌలు, కొక్కెర నాగరాజు, మానవ నరసింహారావు, కందిమల్ల చంద్రమౌళి, బత్తిన వెంకటరావు, శివరామకృష్ణ, ఈఓఆర్డి శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి అంజమ్మ పాల్గొన్నారు.

వేటపాలెం : ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను కొత్తపేట, దేశాయిపేట, రామన్నపేట, వేటపాలెం, పందిళ్ళపల్లి పంచాయతీల్లో ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య పంపిణీ చేశారు. అక్కాయపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో ఆర్‌డిఓ పి సూర్యనారాయణ రెడ్డి, తహశీల్దారు పి కృష్ణ కాంత్, ఎంపీడీఓ ఎంవిఎస్ శర్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జాగబత్తుని పోతురాజు, వెంగళ భరత్, శమ్మి, అందే శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సెక్రెటరీ బడుగు రమేష్, శ్రీనివాసరావు, శవనం రాజశేఖరరెడ్డి, పూర్ణకుమారి, కొమ్మనబోయిన శివలీల, బాలిగ సురేంద్ర, పి శారద పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలోని దేవరపల్లిలో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.4వేలకు ఏప్రిల్ నెలనుండే పెంచి ఇస్తున్నట్లు తెలిపారు. గడిచిన మూడునెలల పెండింగ్ రూ.3వేలతో జున్‌నెల రూ.4వేలు కలిపి రూ.7వేలు అందజేసినట్లు తెలిపారు. వృద్దులు, వితంతులు, వికలాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.



ఆలపాడులో పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



పంగులూరు దళిత కాలనీలో పెన్షన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పోరాటం వైసీపీకి కొత్త కాదు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజా సమస్యలపై పోరాటం వైసిపికి కొత్తేమీ కాదని మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఓటమికి జగన్మోహన్‌రెడ్డిని నిందించటం సరికాదన్నారు. లోపాలను సమీక్ష చేసుకొని ప్రజలకు మరింత సంక్షేమాన్ని అందించే విధంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తాను నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, సర్పంచ్ మాడా సుబ్రహ్మణ్యం, గవిని కృష్ణమూర్తి, రాఘవరెడ్డి, కాగిత సుధీర్ బాబు, యల్లావుల ఏడుకొండలు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డుకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలో కౌలుకు సాగు చేస్తున్న రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు ఎఓ ఎస్ రామమోహనరెడ్డి తెలి పారు. కౌలుకు సాగు చేస్తున్న రైతులు సచివాలయం పరిధిలోని విఆర్ఓ, రైతు సేవ సిబ్బందిని సంప్రదించి కౌలు కార్డ్స్ తీసుకోవాలని తెలిపారు. మద్దతు ధరకు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి వర్తిస్తుందని తెలిపారు.

వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - చీరాల

వైద్య రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ వైద్యులందరికీ అండగా ఉంటానని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక ఐఎంఎ హాలులో ఆయన మాట్లాడారు. బెంగాల్ మాజీ సిఎం, సీనియర్ వైద్యులు డాక్టర్ బీసీ రాయ్ చిత్రపటానికి వైద్యులతో కలసి నివాళి అర్పించారు. తనపై నమ్మకంతో గెలిపించారని, తన గెలుపులో వైద్యుల భాగస్వాం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన వైద్య, ఆరోగ్య ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ వైద్యులను సన్మానించారు.

రేపల్లె : నిజాలను నిర్భయంగా రాసే ఏకైక పత్రిక ప్రజాశక్తి అని ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ బాబు అన్నారు. సోమవారం ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్లో డాక్టర్ డే ప్రత్యేక సంచికను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక అన్ని రంగాల్లో తనదైన శైలిలో వార్త కథనాలను అందిస్తోందని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయడంలోను, సమస్యలను ఎండగట్టడంలోను విన్నూత పద్ధతుల్లో ప్రజాశక్తి కథనాలు ప్రచురిస్తుందని అన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లోని డాక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అఖిల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి వైద్య సంచిక ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య



ప్రజాశక్తి వైద్య సంచిక ఆవిష్కరిస్తున్న కిషోర్‌బాబు

గుండెపోటుతో నూజిళ్ళపల్లి సర్పంచ్ పార్వతి మృతి

ప్రజాశక్తి - పంగులూరు



మద్దినేడి పార్వతి (ఫైల్)

మండలంలోని నూజిళ్ళపల్లి పంచాయతీ సర్పంచ్ మద్దినెడి పార్వతి (74) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహిం చారు. ఆమె సర్పంచిగా 2021 ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె ఆరోగ్యంగా ఉన్నప్పటికీ ఆదివారం ఉదయం ఒకసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఒంగోలులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. పలువురు నాయకులు ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆమె స్వగృహానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమెకు భర్త ఆంజనేయులు, కుమారుడు వెంకట సుబ్బారావు, కుమార్తెలు పావని, సువర్చలాదేవి, శ్రీదేవి ఉన్నారు.



మహిళకు వీల్‌చైర్ బహుకరిస్తున్న రోటరీ ప్రతినిధులు

వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి - పర్చురు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వికలాంగురాలైన వ్యక్తికి వీల్ చైర్ అందజేశారు. యర్రా లక్ష్మీ సౌఖ్య ఆర్థిక సహాయంతో వీల్‌చైర్ అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు తెలిపారు. వికలాంగులకు అవసరమైన సహాయం ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. చేతులు కోల్పోయిన వారికి కృత్రిమ చేతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాళ్ళు కోల్పోయిన వారికి గుంటూరులో 21న కృత్రిమ పాదములు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అవసరమైన వారు తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సీనియర్ సభ్యులు కొల్లా నరేంద్ర కుమార్, పాబోలు ఉదయ్ భాస్కర్. కొల్లా శివ రామ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



పాఠశాల్లో తరగతి గదులు పరిశీలిస్తున్న డిఇఒ

పాఠశాలలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని కుంకలమర్రు జెడ్‌పి ఉన్నత పాఠశాలను డిఇఓ జి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఇఒ ఎం నిర్మల సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి కిట్లను పంపిణి చేసిన అంశాలను సమీక్షించారు. త్రాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్వో ప్లాంట్లను ఎర్పాటు చేసి త్వరగా వినియోగంలోకి తీసకు రానాలని సూచించారు. నాణ్యమైన, గుణాత్మక మైన విద్య బోధించాలని సూచించారు. ఐఎఫ్‌పిలను అన్నీ తరగతులకు సక్రమంగా ఉపయోగించి కోవాలని సంచించారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం బోధన జరగాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం వెంకటేశ్వర్లు, ఎఎస్ఒ సంజయ్, ఇన్ చార్జ్ హెచ్ఎం ఇ ప్రభూజి పాల్గొన్నారు.



వైద్యుల దినోత్సవ వేడుకల్లో ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ డాక్టర్లు

'ఉపాస్'లో వైద్యుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు

జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు సోమవారం స్థానిక ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ప్రకాష్ చావల, డాక్టర్ అనిల్‌కుమార్ కాపా, డాక్టర్ ఉమాపతిచౌదరి, డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్యవృత్తిలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఎంతోమంది ప్రాణాలను నిలబెట్ట డానికి డాక్టర్లు శాయశక్తులా కషి చేస్తూ ప్రజల ఆరోగ్యం కాపాడటంలో ముందుంటున్నారని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ.. వారి మనస్సులను పొందుతూ ముందుకు సాగు దామని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ డాక్టర్ రాంబాబు డాక్టర్స్ డే కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు పోకూరి శ్రీనివాసరావు, చిడుకుల శ్రీధర్, య. శ్రీనివాసరావు, కె.సువర్ణరాజు, పవన్‌కుమార్, జ్యోత్స్న, అనస్తీసియా డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు

ప్రజల నుంచి వస్తున్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. ఆన్‌లైన్ లో వచ్చిన అర్జీలపై ఆయన సమీక్షించారు. నమోదైన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ సత్తిబాబు

పేదలందరికీ చౌక ధరకే నిత్యావసరాలు

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-కర్లపాలెం

పేదలందరికీ చౌకధరకే నిత్యవసర వస్తువులను ప్రభుత్వం సరఫరా చేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. పిట్టలవానిపాలెం మండలం అల్లాపురం గ్రామంలో డిఎంయు వాహనం ద్వారా నిత్యా వసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయ న సోమవారం పరిశీలించారు. లబ్ధిదారుల వేలిముద్రలు, తూకాలు వేయడం, సంబంధిత దస్త్రాలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి విలియమ్స్, తహశీల్దార్ స్ఫూర్తి ఉన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీధర్

ఇన్‌ఛార్జి డిసిహెచ్‌ఎస్‌గా శేషుకుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి డిసిహెచ్‌ఎస్‌గా ఎవి.శేషుకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల ఇన్‌ఛార్జి డిసిహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న ఈయనకు ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈయన గతంలో చీరాల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌గా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శేషుకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది, పలువురు వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు.

జిజిహెచ్ సిఎస్ ఆర్‌ఎంఒగా చెంచయ్య

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్) ఇన్‌ఛార్జి సిఎస్ ఆర్‌ఎంఒగా వి.చెంచయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిజిహెచ్‌లో సీనియర్ డెర్మటాలజిస్ట్‌గా పనిచేస్తున్న ఈయనను ఇన్‌ఛార్జి సిఎస్ ఆర్ఎంఒగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. చెంచయ్య గతంలో తిరుపతిలో డెర్మటాలజిస్ట్ (పిజి)గా పనిచేశారు. సిఎస్ ఆర్‌ఎంఒగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చెంచయ్య మాట్లాడుతూ రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు, సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి సహకారంతో జిజిహెచ్‌లో ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా చెంచయ్యకు జిజిహెచ్ వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ చెంచయ్య

మొక్కుబడి సమాధానాలు చెబితే సహించను

- పెండింగ్ అర్జీల పరిష్కారానికి చర్యలు - అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'చేస్తాం..చూస్తాం.. రిపోర్టు వచ్చాక పరిశీలించి చర్యలు తీసుకుంటాం' అంటూ అర్జీదారులతో మొక్కుబడి సమాధానాలు చెప్తే సహించబోనని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సకాలంలో, సహేతుకంగా "మీకోసం" అర్జీలను పరిష్కరించాలని ఆమె తెలిపారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన "మీకోసం" కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. మీకోసం కార్యక్రమంలో మొత్తం 149 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల ఉన్నతాధికారులు ప్రతిరోజూ "మీకోసం" వెబ్‌సైట్‌ను పరిశీలించి అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాల న్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పిటి షన్లను పరిష్కరించడం ముఖ్యమన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీలు వస్తే.. అవి స్థానికంగా పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారులకు నివేదించి, అవి ఏ స్థాయిలో ఉన్నాయో కూడా తెలుసుకుంటూ ఉండాలని స్పష్టం చేశారు. ఈ విషయాలన్నింటినీ అర్జీదారులకు అర్థమయ్యేలా తెలియజేయాల న్నారు. అలా కాకుండా మొక్కుబడి సమా ధానాలతో అర్జీదారులను స్థానిక కార్యాలయాల చుట్టూ తరచూ తిప్పుకుంటే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

వీధి వ్యాపారుల షాపులు తొలగించొద్దు

కనిగిరిలో వీధి వ్యాపారులకు ప్రత్యామ్నా యం చూపకుండా షాపులు తొలగించవద్దని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జవి కొండారెడ్డి కోరారు. స్థానిక మీకోసం సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలో చెప్పుల బజారు, ప్రధాన వీధుల్లో 250 మందికి పైగా వీధి వ్యాపారులు మున్సిపాలిటీకి ఆక్రమణ పన్ను చెల్లిస్తున్నారన్నారు. వీధి వ్యాపారుల ఉపాధిని దెబ్బతీయకుండా ఆదుకోవాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి కనిగిరి మున్సిపల్ కమిషనర్ గారితో ఫోన్లో మాట్లాడి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్ ఛార్జి డిఆర్ఒ వి. విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఝాన్సీ లక్ష్మి పాల్గొన్నారు.

అతిసార ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనం మీకోసం సమావేశ మందిరంలో సోమవారం అతిసార వ్యాధి నిర్మూలిద్దాం స్పెషల్ క్యాంపెయిన్ వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ మాట్లాడుతూ అతిసార నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 9515432479ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ పద్మజ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో సూపరింటెండెంట్ దుర్గాదేవి

కలెక్టర్‌ను కలిసిన జిజిహెచ్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి.. శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిసి రమణానాయక్ పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ దస్త్రాలన్నీ 4లోగా కమిషన్‌కు నివేదించాలి..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల వ్యయానికి సంబంధించిన దస్త్రాలన్నీ ఈ నెల 4వ తేదీలోగా విధిగా ఎన్నికల కమిషన్‌కు నివేదించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో సోమవారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల వ్యయంపై స్పష్టమైన నివేదికలు సమర్పించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తదుపరి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కోల్పోతారని ఆయన స్పష్టం చేశారు.

లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఉమాపతిచౌదరి

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు లయన్స్ క్లబ్ 316 హెచ్ నూతన ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఉమాపతి చౌదరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి ఒంగోలులోని ఫంక్షన్‌హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు హాజరై.. మాట్లాడారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఎప్పుడూ సేవానిరతి కలిగి ఉండాలని పేర్కొన్నారు. తాను కూడా లయన్స్ క్లబ్ సభ్యుడినే అని తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులకు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. 58వ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా ఒంగోలు సాయిశశిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ ఉమాపతిని నియమిస్తూ సోమవారం లయన్స్ క్లబ్ స్టేట్ బాధ్యులు ఎం ఉపేంద్ర, ఏఆర్‌కె.చౌదరి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ డాక్టర్ ఉమాపతి మాట్లాడుతూ రాబోయే సంవత్సర కాలంలో లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు అనేక ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపడతామన్నారు. నలుగురికి ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా లయన్స్ క్లబ్‌కి మంచి పేరు తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా ప్రకాశం జిల్లా అడిషనల్ ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు లయన్స్ క్లబ్ మార్కెటింగ్ చైర్మన్ డాక్టర్ ప్రకాష్ చావల, డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



డాక్టర్ ఉమాపతి చౌదరికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలి

- ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి
- అద్దంకి బస్టాండ్‌లో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రవాణా రంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రిమినల్ చట్టాలను ఉపసంహరిం చుకునే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు హెచ్చరిం చారు. మూడు క్రిమినల్ చట్టాలను ఖండిస్తూ ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్, స్టాఫ్ వర్కర్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు పెరిగే కొద్దీ, సామాజిక అస్థిరతలు పెరుగుతాయన్నారు. తదనుగుణంగా రాజకీయ అస్థిరతలు పెరుగుతాయని, ప్రభుత్వాల మనుగడ కోసం కొత్త పాలనా విధానాల అవసరం ఏర్పడుతుందన్నారు. . న్యాయవ్యవస్థలో ఫాసిస్టు విధానం ప్రవేశపెట్టే లక్ష్యంలో భాగమే కొత్త న్యాయ చట్టాలు వచ్చాయన్నారు. స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యం.అయ్యపరెడ్డి మాట్లాడుతూ రవాణా రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు చట్టాలతో శిక్షలు, జరిమానాలు అధికంగా పడతాయన్నారు. సామాజిక భద్రత కొరవడుతుందని తెలిపారు. ఈ చట్టాలు ఉపసంహరించుకొనే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో బివి రావు, మహ్మద్‌బేగ్, ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.